క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రమేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: హిప్ జాయింట్ ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న గోడి ఇందిరానగర్ కాలనీకి చెందిన మందపాటి రమేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ.లక్ష మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గోడిలోని ఆయన నివాసంలో అందజేశారు. అలాగే రెబ్బనపల్లికి చెందిన బొమ్ము సత్యనారాయణకు సీఎంఆర్ఎఫ్ కింద రూ. 30 వేల చెక్కును ఎమ్మెల్సీ అందించారు. సీఎం జగన్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వతోముఖాభివృద్ధికి కృషి



కనకాలపేట హైస్కూల్‌లో నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. గురువారం రూ.1.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కనకాలపేటలో కామిశెట్టి పరశురామ వరప్రసాదరావు నాయుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్చి, తదితర నిర్మాణాలకు అదేవిధంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు బ్లాక్ నిర్మాణానికి, రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో టాయిలెట్ల మరమ్మతులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన

ముమ్మిడివరం: సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించే ఓటింగ్ యంత్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మధుసూదన్ సూచించారు. ముమ్మిడివరం ఎంజీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నియోజకవర్గంలోని 268 పోలింగ్ బూత్‌లకు సంబంధించి అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఆర్ఓ, తహసీల్దార్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాట్రేనికోన: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వేట్లపాలెంలోని తన స్నేహితుడు పెద్దరాజు స్వగృహంలో కలిశారు. పూర్వ విద్యార్థి వెంట్రు ప్రసాద్ అధ్యక్షతన ఈ సమ్మేళనం జరిగింది. రెండేళ్ల కిందట సమావేశమైన పూర్వ విద్యార్థులు డాకమర్రి నాగమనీష్, పెద్దిరాజు ప్రోద్బలంతో స్నేహితులు అందరూ కలసి సేవా మిత్రా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందిస్తున్న స్నేహితుడు కుంచే బాలకృష్ణ మాస్టారు దంపతులను ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు. ట్రస్టు పాలకవర్గ సభ్యులు డాకమర్రి నాగమనీష్, దంతులూరి రామకృష్ణంరాజు, కోలా త్రిమూర్తులు, దుర్గాప్రసాద్ తదితరులను సన్మానించారు.

పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

యానాం: అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల అంతర్ రాష్ట్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీల ట్రోఫీని గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ నెల 28న నిర్వహించే ఈ పోటీలకు ఏపీ, పుదుచ్చేరి ప్రాంతాల నుంచి బాడీబిల్డర్స్ పాల్గొని తమ సత్తాను చాటనున్నారన్నారు. 55 నుంచి 85 కిలోల వరకూ ఒక గ్రూపు, 40 కిలోల పైబడి మరో గ్రూపు, బెస్ట్ ఫిజిక్ మరో గ్రూపుగా విడదీసినట్లు యానాం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్‌ప్రభాకర్ తెలిపారు.

బోడసకుర్రును దత్తత తీసుకోవాలి

అల్లవరం: చమురు నిక్షేపాలను తరలించుకుపోతున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు బోడసకుర్రు గ్రామాభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. దేవర్లంక గెయిల్ గ్యాస్ కలెక్షన్ సెంటర్ వద్ద గ్రామాన్ని దత్తత తీసుకోవాలంటూ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్లకార్డులు ధరించి గురువారం నిరసన చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో కలసి ఓఎన్జీసీ అధికారులకు 12 డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్ అందించారు.

12న జాబ్ మేళా

అమలాపురం రూరల్: ప్రైవేట్ కంపెనీలలో పనిచేయడానికి 12వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి అమలాపురం ఉపాధి కార్యాలయం వద్ద జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆమె కోరారు. సహాయం కోసం 8121838392 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- సమనస, బండారులంకలో పలు పనులకు శ్రీకారం



అమలాపురంలో చేయూత లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు



సమనసలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో పేదల జీవితాలకు వెలుగులు వచ్చాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం మండలంలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. తొలుత సమనసలో ఎంపీ లాడ్స్ రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ, గ్రావెల్ రోడ్లను ప్రారంభించారు. అదే గ్రామంలో నరేగా నిధులు రూ. 25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. సమనస జాంబవపేట వద్ద జల్‌జీవన్ మిషన్ కింద రూ. 30.60 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. బండారులంకలో నరేగా నిధులు రూ.23. 94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం–1 భవనాన్ని ప్రారంభించారు. అక్కడే రెండు రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచులు పెనుమాల సునీత, పరమట శ్యామ్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సమనస పంచాయతీ రంగాపురంలో వైఎస్సార్ సీపీ స్తూపాన్ని మంత్రి విశ్వరూప్ ఆవిష్కరించారు. రాష్ట్ర కరికాల భక్త కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ల రమేష్ బాబు బృందం ఆధ్వర్యంలో ఈ స్తూపాన్ని నిర్మించారు. పినిపే శ్రీకాంత్, మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్పర్జన్‌రాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు మామిళ్లపల్లి ఫణికుమార్, నాని తదితరులు పాల్గొన్నారు.

చేయూతతో ఆర్థిక పురోభివృద్ధి

అమలాపురం టౌన్: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 అందించడంతో ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తున్నారని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణానికి సంబంధించి ఆ పథకం ద్వారా 1,463 మంది మహిళలకు మంజూరైన 2.74 కోట్ల నిధులను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళా సాధికారిత సాకారమైందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కమిషనర్ ఎస్.మనోహర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు పెన్మత్స చిట్టిరాజు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ పాల్గొన్నారు.

అల్లవరం: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమం జరిగింది. దీనికి మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్ చేయూత కింద 3,860 మంది మహిళలకు రూ. 7.23 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేటి వరకూ వివిధ పథకాల ద్వారా రూ. 2 లక్షల 50 వేల కోట్ల నిధులను డీబీటీ ద్వారా మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ పథకాలు అందలేదన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరికల శ్రీను, యూత్ జిల్లా కార్యదర్శి దాసం రాంబాబు, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, సర్పంచ్ బొమ్ము బాలవేణి పాల్గొన్నారు.



అల్లవరంలో మహిళలకు చేయూత చెక్కు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: బండారులంక వ్యవసాయ పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బండారులంక రాజగోపాల్ సహకార సంఘ చైర్మన్‌గా వాసంశెట్టి సత్యనారాయణ, త్రిమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. మాజీ సంఘ అధ్యక్షుడు కండిబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడారు. అనంతరం సత్యనారాయణ, త్రిమెన్ కమిటీ సభ్యులను మంత్రి సత్కరించారు. నాయకులు జాన గణేష్, కామిశెట్టి శ్రీను, గుత్తుల సురేష్, దంగేటి బుల్లిబ్బులు, ముషిణి గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి అత్యంత ప్రాధాన్యం

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం ఈడబ్ల్యూఎస్ కాలనీలో రూ.1.05 కోట్లతో నిర్మించిన రెండో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటరు భవనాన్ని ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ వైద్య సాయాన్ని అందించేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని మంత్రి స్పష్టం చేశారు. మరో అతిథి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ అమలాపురంలో నాలుగు ఆస్పత్రుల ద్వారా ప్రభుత్వపరంగా వైద్య సేవలు విస్తరించడం మంచి పరిణామమన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మున్సిపల్ వైస్ చైర్మన్లు రుద్రరాజు నానిరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, స్థానిక వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, దేవరపల్లి గీత, షేక్ అబ్దుల్ ఖాదర్, డాక్టర్ పినిపే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తాళ్లరేవు: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. గురువారం తాళ్లరేవులో ఐసీడీఎస్, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ మహిళలు సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ వంజరాన మాధవి ఎంపీపీ సునీతను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు మంగాయమ్మ, ఉమ, ఐద్వా జిల్లా కార్యదర్శి రమణి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.తాతారావు, ప్రతినిధులు వి.సోని, బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాపులకు న్యాయం కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు మంగారావు

అమలాపురం టౌన్: కాపులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర కాపు నాడు కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు కాపుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురం మహిపాల వీధిలో ఏర్పాటు చేసిన కాపు నాడు కార్యాలయాన్ని మంగారావు గురువారం ప్రారంభించారు. రాష్ట్ర కాపు నాడు కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాపు డిక్లరేషన్, కాపులను బీసీల్లో చేర్చే అంశాలపై చర్చించింది. అనంతరం వివిధ మండలాలకు నియమించిన కాపు నాడు కమిటీల కన్వీనర్లకు నియామక పత్రాలను రాష్ట్ర నాయకులు మంగారావు, సురేష్‌లు అందించి వారిని ఘనంగా సత్కరించారు. కాపు నాయకులు పత్తి దత్తుడు, గంగుమళ్ల శ్రీనివాస్, త్సవటపల్లి నాగు, ఉంగరాల అబ్బులు, కాకిలేటి దుర్గారావు తదితరులు ప్రసంగించారు.

పేదల సొంతింటి కల సాకారం



ముమ్మిడివరంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ముమ్మిడివరం: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో పేదలకు అందించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. ముమ్మిడివరం అర్బన్‌లో 1,123 మంది లబ్ధిదారులకు, మండల రూరల్‌లో 1,557 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, రెవెన్యూ అధికారులు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ఇళ్ల స్థలాలు అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, కోలా బాబ్జీ, రెడ్డి శివన్నారాయణ, మట్టపర్తి సత్యనారాయణ, వరసాల రమాదేవి, పాము చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి.. ప్రణమంటి



మురమళ్లలో వీరేశ్వరస్వామి ఆలయం



భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

- మహా శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన ఆలయాలు

ఐ.పోలవరం: శివరాత్రి ఉత్సవాలకు వేళయ్యింది.. శుక్రవారం అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించనున్నారు. మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రాన్ని విద్యుత్ దీపాలు, భారీ పందిళ్లతో ముస్తాబు చేశారు. ఇక్కడ ఐదు రోజులు ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి స్వామివారి దర్శనాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు ఉంటాయి. ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకూ ద్వాదశ పుష్కరనదీ జలాలతో అభిషేకం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు శూలాల సంబరం, బాణసంచా కాల్పులు, నాద స్వర బృందాలతో ధూపసేవ అనంతరం నందా దీపం ప్రజ్వలన జరుగుతుంది. చివరి రోజు 12న ఉదయం అభిషేకాలు, కుంకుమపూజలు ఉంటాయి. అనంతరం వృద్ధ గౌతమీ గోదావరిలో హంస వాహనంపై తెప్పోత్సవం జరుగనుంది. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

తాళ్లరేవు: చొల్లంగి రాజరాజేశ్వరి సహిత సోమేశ్వర స్వామివారి ఆలయం, తాళ్లరేవు, సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరాలయాలు, పిల్లంక, పటవలలో కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వర స్వామివారి ఆలయాలు, ఇంజరం ఉమా కృపేశ్వర స్వామి ఆలయం, ఉప్పంగల రామలింగేశ్వర స్వామివారి ఆలయం, నీలపల్లి నీలకంఠేశ్వరస్వామివారి ఆలయం, పాతకోరంగి కురంగేశ్వరస్వామి తదితర ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లకు పురోహితులు భైరవభట్ల వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. పానుగంటి సాయికిరణ్, మనోజ్ఞ దంపతులచే కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఉమాసూరేశ్వర స్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమా సోమేశ్వర స్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేల్లంక ఉమాసోమేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సుంకరపాలెంలో ఎత్తయిన పరమేశ్వరుని విగ్రహం



గొల్లవిల్లి భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం చేస్తున్న పురోహితులు

అన్ని రంగాల్లో ‘ఆమె’



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు స్వీకరిస్తున్న భారతి (ఫైల్)

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

యానాం: సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకవైపు అధికార బాధ్యతలతో పాటు ఇంటి వద్ద కుటుంబ పాత్రలో ఒదిగిపోతున్నారు. ఎన్నికల సక్రమ నిర్వహణలో ప్రత్యేకత చాటుతున్న ఐఏఎస్ అధికారి భారతి యానాం మహిళే.. ప్రస్తుతం గుజరాత్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సవాళ్లతో కూడిన ఉద్యోగమైనప్పటికీ ఆమె 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం కూడా ఆమె సీఈఓగానే బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు గోద్రా జిల్లా, వడోదరా తదితర జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. విద్య, కార్మిక శాఖల్లో ఉన్నతాధికారిగా వ్యవహరించారు. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ద్వారా ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డును అందుకున్నారు. ఆమె తండ్రి పొనుగుమట్ల ఈశ్వరరావు పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసేవారు. 2005లో ఆమె ఐఏఎస్‌కు ఎంపికైతే, ఆమె అన్నయ్య ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తన భర్త సుమన్‌రత్నం ఐఆర్ఎస్ గుజరాత్ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ)గా పనిచేస్తున్నారు. ప్రస్తుత యువతులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాగితే అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని భారతి అంటున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. పలు సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు. సునీత మాట్లాడుతూ మండలంలో రూ.33 లక్షలతో వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. నీలపల్లి, ఉప్పంగల, తాళ్లరేవు, పి.మల్లవరం గ్రామాల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ చింతా మోహనకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ కిరణ్‌కుమారి, నందికోళ్ల శ్రీదేవి, పాలెపు చినపోశియ్య పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అమలాపురం రూరల్: స్థానిక జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజ్ పీఓ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా అడ్వకేట్ సూర్యనారాయణ మూర్తి, భీమనపల్లి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ కె.కార్తీక, వైద్యురాలు కె.అనూష పాల్గొని ప్రసంగించారు. జిల్లా స్థాయిలో పది మంది ఉత్తమ మహిళా ఉద్యోగినులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. రాజోలు, రామచంద్రపురం, రావులపాలెం డిపోల మేనేజర్లు భాస్కరరావు, వెంకటేశ్వర్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యురాలు కె.అనంతలక్ష్మి హాజరై మాట్లాడారు.



ఉత్తమ ఉద్యోగినులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఆర్టీసీ పీఓ ప్రసాద్, డిపో మేనేజర్లు

ఓఎన్జీసీ పరిహారం జమ

యానాం: ఓఎన్జీసీ ప్రారంభించిన రెండో గ్యాస్ పైపులైన్ నిర్మాణంతో జీవనోపాధి కోల్పోతున్న యానాం మత్స్యకారులకు ఎట్టకేలకు గురువారం సంబంధిత సంస్థ ఇచ్చిన నష్ట పరిహారం సొమ్ము రూ.90.54 కోట్లను విడుదల చేస్తూ పుదుచ్చేరి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. అర్హుల పేర్లను ప్రాంతీయ కమిటీ విచారించి 5,289 మందితో కూడిన జాబితాను తయారుచేసింది. 2022 జనవరి 28నుంచి 2023 ఏప్రిల్ 28 కాలానికి జీవనోపాధి కోల్పోయినందుకు ఈ మొత్తం నష్ట పరిహారంగా విడుదల చేసింది. గురువారం నుంచి ఇండియన్ బ్యాంకు ఖాతాదారులకు సొమ్ము జమ అవుతుండగా, శుక్రవారం నుంచి మిగిలిన అన్ని బ్యాంకు అకౌంట్లకు సొమ్ము జమ అవుతుందని అధికారులు తెలిపారు.

గడప గడపకూ పథకాల లబ్ధి

కాట్రేనికోన: జగనన్న ప్రభుత్వంలో గడప గడపకూ సంక్షేమ పథకాల లబ్ధి అందుతుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అన్నారు. గురువారం సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, పార్టీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో గడప గడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమం కంచువారిపేట, వనచర్ల వీధి, బ్రాహ్మణ చెరువు తదితర ప్రాంతాల్లో జరిగింది. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంసాని నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంతంరాజు, జగడం బాలయ్య, మల్లి తదితరులు ఉన్నారు.